**పత్రికా సమావేశం**

**తేది : 26.02.2020**

**అమరావతి**

## ప్రశాంత వాతావరణంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు

- **పరీక్షా విధానంలో తొలిసారి ఆధునిక సాంకేతిక విధానాలు**
- **పదో తరగతిలో బిట్ పేపరుకు బదులు లక్ష్యాత్మక ప్రశ్నలు**

**:రాష్ట్ర విద్యాశాఖా మంత్రి ఆదిమూలపు సురేష్**

అమరావతి, ఫిబ్రవరి 26 : రాష్ట్రంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తంగా ఉందని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. ఈ మేరకు సచివాలయంలోని 4వ బ్లాక్ ప్రచార విభాగంలో బుధవారం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన విధివిధానాలను, ప్రభుత్వ ఏర్పాట్లను మీడియాకు వివరించారు. మార్చి 4వ తేది నుంచి మార్చి 23 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. మార్చి 23 నుంచి ఏప్రిల్ 8 వరకు పదో తరగతి పరీక్షలు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 గం.ల నుండి మధ్యాహ్నం 12.15 గం.ల వరకు జరుగుతాయని మంత్రి తెలిపారు. పరీక్షల సమయంలో ఉదయం 9 గంటల నుండి 12.30 గం.ల వరకు సమీప ప్రాంతాల్లో ఉండే జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు.

రాష్ట్రం మొత్తం మీద ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 10,65,156 మంది హాజరవుతుండగా, టెన్త్ పరీక్షలు 6,39,022 మంది అభ్యర్థులు రాయనున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు 5,07,228 మంది రెగ్యులర్ విద్యార్థులు, 39,140 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరవుతున్నారని అదే విధంగా ద్వితీయ సంవత్సర పరీక్షలకు 4,88,795 మంది, ఒకేషనల్ కు సంబంధించి 29,993 మంది విద్యార్థులు హాజరవుతున్నారని మంత్రి పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు వారి తల్లిదండ్రులు మార్చి 4వ తేది నుంచి విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్ ద్వారా తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఇందుకుగానూ ల్యాండ్ లైన్ ఫోన్ నంబరు : 0866 - 2974130, టోల్ ఫ్రీనంబరు : 1800 274 9868, ఇ-మెయిల్ ఐడి నంబరు : ourbieap@gmail.com వాట్సాఫ్ నంబరు : 9391 282 578ల ను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి 1411 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇంటర్మీడియట్ పరీక్షలను తనిఖీ చేసేందుకు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ రీజనల్ స్థాయిలో ఏర్పాటు చేశామన్నారు.

పదవ తరగతి పరీక్షలకు సంబంధించి 6,37,284 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,738 మంది ఒకేషనల్ విద్య అభ్యసించే విద్యార్థులు హాజరవుతున్నారని మంత్రి వెల్లడించారు.

పదో తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి 14వ తేది నుంచి విజయవాడ కేంద్రంగా కంట్రోల్ రూమ్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. వివరాల కోసం ల్యాండ్ లైన్ నంబర్ 0866 2974 540, 0866 2974 550 లతో పాటు ఇ-మెయిల్ ఐడి dir_govexams@yahoo.com & dgepeshi@gmail.com లను సంప్రదించవచ్చన్నారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి 2923 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ దఫా పదో తరగతి పరీక్షా విధానంలో బిట్ పేపరుకు బదులుగా లక్ష్యాత్మక ప్రశ్నలను రూపొందించామన్నారు.

పరీక్షల అనంతరం వెలువడే ఫలితాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు సాధించిన మార్కులను యథావిధిగా జాబితాలో పొందుపరచడం జరుగుతుందన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫలితాలు మాత్రం గతంలో మాదిరి గ్రేడింగ్ రూపంలో

ఇవ్వడం జరుగుతుందన్నా . ఉన్నత చదువులు, పోటీ పరీక్షల సమయంలో గ్రేడింగ్ విధానం ద్వారా ఇబ్బందులు ఎదురువుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఎటువంటి అవకతవకలకు తావులేకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పకడ్బంధీగా పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి భరోసానిచ్చారు. కష్టపడి చదివే విద్యార్థులు, ప్రతిభ గల విద్యా నష్టపోకుండా మాస్ కాపీయింగ్ పై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. మాల్ ప్రాక్టీస్ మరియు సరైన వివరాలు లేని అభ్యర్థులపై విద్యాశాఖ-1997 చట్ట ప్రకారం (జీవోనంబర్.114) చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలు నిర్వహించే ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉండేలా పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పరీక్షలు జరిగే గదుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలతో పాటు ఫర్నీచర్, విద్యుత్తు, తాగునీరు, వైద్య సదుపాయం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేగాక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ సౌకర్యం, పరీక్షా పత్రాల తరలింపుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఎటువంటి అనుమానాలు, ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే వ్యక్తిత్వ వికాస నిపుణులు, వక్తలతో అవగాహన సదస్సులు పాఠశాలలోనే ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్ష రాసేందుకు గతంలో మాదిరి కాకుండా 24 పేజీలతో బుక్ లెట్ అందజేస్తామన్నారు. అందులో పరీక్షలు రాసే విద్యార్థుల పేర్లు, వివరాలను బార్ కోడ్ పద్ధతిలో తయారు చేయడం జరిగిందని అన్నారు. తద్వారా విలువైన పరీక్షా సమయం వృథా అవకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు. పదో తరగతి పరీక్షలకు 156 మంది, ఇంటర్మీడియట్ కు 130 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ను నియమించామన్నారు. పరీక్ష సమయంలో విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లను, ఫ్లైయింగ్ స్క్వాడ్ లకు జంబ్లింగ్ విధానం ఏర్పాటుచేశామన్నారు. ఏ అధికారి కూడా సెల్ ఫోన్ లను పరీక్షా సెంటర్ లోకి తీసుకురాకుండా స్పష్టమైన ఆదేశాలు జారీచేశామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు 35వేల మంది సిబ్బంది అవసరమవుతారని అవసరమైతే గ్రామ, వార్డు సెక్రటేరియట్ లో పనిచేసే సిబ్బంది సేవలు వినియోగించుకుంటామన్నారు. ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూమ్స్ విధిగా పనిచేస్తాయని మంత్రి పేర్కొన్నారు.

పదో తరగతి విద్యార్థులు www.bsc.ap.org, ఇంటర్మీడియట్ విద్యార్థులు www.bie.ap.gov.in వెబ్ సైట్లో తమ హాల్ టిక్కెట్లను డౌన్ లోడ్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఇక పరీక్షా ప్రాంతానికి చేరుకునే విద్యార్థులకు ఐపీఈ సెంటర్ లొకేటర్ యాప్ ద్వారా నో యువర్ సీట్ ఆప్షన్ క్లిక్ చేసి అభ్యర్థి తన వివరాలు నమోదు చేయడం ద్వారా పరీక్ష హాల్లో తాను కూర్చొనే ప్రదేశాన్ని తెలుసుకోవచ్చన్నారు.

అంతకు ముందు పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు 3 సార్లు సమీక్షా సమావేశాలు జరిపామన్నారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ, పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, విద్యుత్తు, పోస్టల్, ఆర్టీసీ శాఖలను సమన్వయ పరుచుకొని పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఏ అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ వి.రామకృష్ణ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ బోర్డు రమేష్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, సర్వ శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెకు డైరెక్టర్ చినవీరభద్రుడు పాల్గొన్నారు.

**గమనిక : పత్రికా ప్రకటనకు సంబంధించిన ఫోటోలు జతచేయడమైనది**

**జారీచేసిన వారు: ప్రచార విభాగం, సమాచార పౌర సంబంధాల శాఖ- వెలగపూడి సచివాలయం**